జాతీయ తెలుగు దినపత్రిక
# ప్రజాజ్యోతి
ప్రతి అక్షరం ప్రజల కోసం
## భద్రాద్రి కొత్తగూడెం
శనివారం | 12 | సెప్టెంబర్ | 2026 ♦ పేజీలు : 7

### అన్నపురెడ్డిపల్లి పోలీస్‌స్టేషన్‌లో
# ఎస్పీ రోహిత్ రాజు వార్షిక తనిఖీలు

- రికార్డుల పరిశీలన.. పోలీస్ సిబ్బందికి పలు సూచనలు
- పెండింగ్ కేసులపై దృష్టి.. రాత్రి గస్తీ ముమ్మరం చేయాలని ఆదేశం



**అన్నపురెడ్డిపల్లి, సెప్టెంబర్ 11, (ప్రజా జ్యోతి):** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అన్నపురెడ్డిపల్లి మండల పోలీస్ స్టేషన్‌లో జిల్లా ఎస్పీ రోహిత్ రాజు శుక్ర వారం వార్షిక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్టేషన్‌లోని రికార్డులు, నేరాల నమోదు తీరు, ఫిర్యాదుల

మిగతా 2 లో...

- 40 మందికి పైగా విద్యార్థినులకు కాటు?
- కొందరికి భద్రాచలం ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స
- ఈ నెల 9న కొందరికి ఇంజక్షన్లు?
- 160 మంది విద్యార్థినుల భద్రతపై ఆందోళన
- వసతి గృహంలో విపరీతంగా ఎలుకల సంచారం
- ఆసుపత్రి రికార్డుల్లో కళాశాల పేరు లేకుండా జాగ్రత్తలు ?
- ఘటనను గోప్యంగా ఉంచుతున్నారన్న ప్రచారం




2 లో..

### సారపాక మైనారిటీ కళాశాలలో..
# ఎలుకల దాడి?!

సారపాకలోని తెలంగాణ రాష్ట్ర మైనారిటీ రెసిడెన్షియల్ విద్యా సంస్థల సొసైటీకి చెందిన కళాశాల వసతి గృహంలో ఎలుకల బెడద తీవ్రంగా ఉన్నట్లు విశ్వసనీయ సమాచారం అందుతోంది. సుమారు 160 మంది విద్యార్థినులు ఉంటున్న వసతి గృహంలో ఇప్పటికే 40 మందికి పైగా విద్యార్థినులను ఎలుకలు కరిచినట్లు తెలుస్తోంది. కాటుకు గురైన వారిలో కొందరికి గాయాల తీవ్రత ఎక్కువగా ఉండటంతో భద్రాచలం ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లి వైద్యుల సూచన మేరకు ఇంజక్షన్లు ఇప్పిస్తున్నట్లు సమాచారం.

**భద్రాద్రి కొత్తగూడెం ప్రతినిధి / బూర్గంపాడు, ప్రజాజ్యోతి**

### భూ రీసర్వేను
# వేగవంతం చేయండి



- ట్యాబ్, రోవర్ టెక్నాల జీతో సరిహద్దుల నిర్ధారణ పరిశీలన...
- గోదావరి వరదలతో 250 మీటర్లు మారిన భూ సరిహద్దులను పాత రికార్డులతోనే పరిష్కారం...
- అమ్మగారిపల్లిలో 1900 ఎకరాల రీ సర్వే..! 1920 నాటి ఫసలీ రికార్డుల పరిశీలన...
- సాంకేతికతతోనే భూ సమస్యలకు చెక్...
- రైతులకు భూమిపై స్పష్టత కల్పించాలి...
- అమ్మగారిపల్లికి సీఎం స్ఆర్ నిధులతో రోడ్డు...
- హెవీ వాటర్ ప్లాంట్ నిధులతో నిర్మాణానికి జిల్లా కలెక్టర్ అంకిత్ ఆదేశం...

**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా క్రైమ్ ప్రతినిధి/అశ్వాపురం. సెప్టెంబర్ 11 ప్రజాజ్యోతి**
భూ రీ సర్వేలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని సమర్ధవంతంగా వినియోగించి భూ సరిహద్దుల ను కచ్చితంగా నిర్ధారిస్తూ

మిగతా 2 లో...

### మణుగూరులో
# ఫారెస్ట్ అధికారుల కొరడా

- ఒక్క నెలలోనే రెండు ట్రాక్టర్లు సీజ్...
- జామాయిల్, అటవీ కలప అక్రమ రవాణాపై ఉక్కుపాదం...
- అటవీ సంపద దోపిడీ దారులపై నిఘా పెంపు..!
- తనిఖీలు ముమ్మరం...
- మణుగూరు ఫారెస్ట్ రేంజర్ ఉపేందర్...



**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా క్రైమ్ ప్రతినిధి/మణుగూరు. సెప్టెంబర్ 11 ప్రజాజ్యోతి...** మణుగూరు రేంజ్ పరిధిలో అటవీ సంపద అక్రమ రవాణాపై ఫారెస్ట్ అధికారులు ఉక్కుపాదం మోపుతున్నారు. అటవీ కలప, జామాయిల్ ను అక్రమంగా తరలిస్తున్న వారిపై వరుస దాడులు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా

మిగతా 2 లో...

# రౌడీషీటర్లు సత్ప్రవర్తనతో మెలగాలి

- భద్రాచలం డీఎస్పీ అరుణ్‌కుమార్

**చర్ల, సెప్టెంబర్ 11:(ప్రజాజ్యోతి):** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఆదేశాల మేరకు భద్రాచలం డీఎస్పీ అరుణ్‌కుమార్ శుక్రవారం చర్ల పోలీస్‌స్టేషన్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా పోలీస్‌స్టేషన్ పరిధిలోని రౌడీషీటర్లను పిలిపించి వారి ప్రవర్తన, ప్రస్తుత కార్యకలాపాలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు.రౌడీషీటర్లు ఇకపై ఎలాంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడకుండా సత్ప్రవర్తనతో జీవించాలని డీఎస్పీ సూచించారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించే చర్యలకు పాల్పడితే చట్టపరంగా కఠిన



చర్యలు తప్పవని హెచ్చరించారు. చట్టాలను గౌరవిస్తూ కుటుంబ సభ్యులతో ప్రశాంతంగా జీవించాలని సమాజంలో బాధ్యతాయుత పౌరులుగా మెలగాలని సూచించారు.రౌడీషీటర్ల కదలికలు, కార్యకలాపాలపై పోలీసులు నిరంతరం నిఘా ఉంచాలని డీఎస్పీ పోలీసు సిబ్బందికి సూచించారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని ఆదేశించారు.ఈ కార్యక్రమంలో చర్ల సీఐ రాజు వర్మ, ఎస్సైలు నర్సిరెడ్డి, కేశవ్, పోలీస్‌స్టేషన్ సిబ్బంది, స్పెషల్ పార్టీ సిబ్బంది పాల్గొన్నారు.

## భూ రీసర్వేను వేగవంతం చేయండి...

(మొదటి పేజీ తరువాయి...)

పనులను వేగవంతంగా పూర్తి చేయాలని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ అంకిత్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం అశ్వాపురం మండలం అమ్మగారిపల్లి గ్రామంలో పర్యటించి ఆ గ్రామంలో కొనసాగుతున్న భూ రీ సర్వే పనులను ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు. రోవర్, ట్యాబ్ పరికరాలతో చేపడుతున్న డిజిటల్ సర్వే ప్రక్రియను పరిశీలించి పనుల పురోగతిని ఆరా తీశారు. డిజిటల్ విధానంలో సర్వే నిర్వహించడం వల్ల సమయం, సిబ్బంది ఆదా కావడంతో పాటు ట్యాబ్‌లో నమోదైన సమాచారాన్ని నేరుగా కంప్యూటర్, ఆటోక్యాడ్‌లోకి మార్చుకునే అవకాశం ఉందని అధికారులు కలెక్టర్‌కు వివరించారు. అమ్మగారిపల్లి, కుమ్మగూడెం పరిధిలో కాడస్ట్రల్ మ్యాపులు, పాత రెవెన్యూ రికార్డుల ఆధారంగా సుమారు 1,900 ఎకరాలకు పైగా భూముల సరిహద్దులను నిర్ధారిస్తున్నట్లు తెలిపారు. 1920ల నాటి ఫసలీ రికార్డులతో పాటు బూర్గంపాడు తాలూకాకు సంబంధించిన పాత రికార్డులను కూడా పరిశీలిస్తున్నట్లు చెప్పారు. అయితే మూడు తరాలుగా భూములను అనుభవిస్తున్నప్పటికీ రికార్డుల్లో ఉపవిభజనలు నమోదు కాకపోవడం వల్ల ఎదురవుతున్న సమస్యలను రైతులు కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు.

- **గోదావరి వరదల వల్ల పాత భూ సరిహద్దులు మార్పు...**

గోదావరి వరదలు, భూమి కోతల కారణంగా కొన్ని ప్రాంతాల్లో పాత భూ సరిహద్దులు మారిపోయాయని, సీతారామ ప్రాజెక్టు పరిసరాల్లో కొన్ని చోట్ల సుమారు 250 మీటర్ల మేర మార్పులు చోటుచేసుకున్నట్లు అధికారులు వివరించారు. 57/1 తదితర సర్వే నంబర్లలో నీట మునక, ఇసుక మేటల కారణంగా పాత భూ గుర్తులు కనుమరుగయ్యాయని తెలిపారు. కేఎంఎల్ ఫైళ్ల ఆధారంగా సుమారు 7.91 కిలోమీటర్ల మేర సరిహద్దులను గుర్తిస్తున్నామని, రోజుకు సుమారు 2 కిలోమీటర్ల చొప్పున సర్వే నిర్వహించి 2 నుంచి 4 రోజుల్లో పనులను పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు అధికారులు కలెక్టర్ కు వివరించారు. పాత రికార్డులను సమగ్రంగా పరిశీలించి, క్షేత్రస్థాయిలో ఎదురవుతున్న సమస్యలను పరిష్కరిస్తూ రైతులకు భూములపై పూర్తి స్పష్టత కల్పించాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. ఇదే సందర్భంలో గ్రామస్తులు తమ ప్రాంతంలో రహదారి నిర్మించాలని కలెక్టర్‌ను కోరగా వెంటనే స్పందించిన ఆయన అశ్వాపురం హెవీ వాటర్ ప్లాంట్ సీఎస్ఆర్ నిధులతో అవసరమైన మేరకు రహదారి నిర్మాణానికి చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అశ్వాపురం తహసీల్దార్ సూర్యప్రకాష్, సర్వే అధికారులు, సంబంధిత శాఖల అధికారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## మణుగూరులో ఫారెస్ట్ అధికారుల కొరడా...

(మొదటి పేజీ తరువాయి...)

సెప్టెంబర్ నెలలో రెండు ట్రాక్టర్లను సీజ్ చేసినట్లు మణుగూరు ఫారెస్ట్ రేంజర్ ఉపేందర్ తెలిపారు. ఈ నెల 3వ తేదీన అనుమానాస్పదం గా తిరుగుతున్న ట్రాక్టర్ ను తనిఖీ చేయగా అందులో జామాయిల్ ఉన్నట్లు గుర్తించి సీజ్ చేశారు. అలాగే శుక్రవారం మరో ట్రాక్టర్ లో అటవీ కలపను అక్రమంగా తరలిస్తుండగా పట్టుకుని సీజ్ చేసినట్లు ఆయన వెల్లడించారు. సీజ్ చేసిన రెండు ట్రాక్టర్లను రేంజ్ కార్యాలయానికి తరలించి కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. అటవీ ప్రాంతంలో అక్రమం గా చెట్లను నరికి కలపను తరలించడం, అటవీ ఉత్పత్తులను దొంగతనంగా రవాణా చేయడం చట్టరీత్యా నేరమని రేంజర్ హెచ్చరించారు. అటవీ సంపదను కాపాడేందుకు ప్రత్యేక నిఘా బృందాలను ఏర్పాటు చేశామని, రేంజ్ పరిధిలో ఎక్కడ అక్రమ రవాణా జరిగినా కఠిన చర్యలు తప్పవని స్పష్టం చేశారు. అటవీ సంపద దోపిడీపై ప్రజలు కూడా సమాచారం అందించాలని ఆయన కోరారు. ఈ ఫారెస్ట్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## అన్నపురెడ్డిపల్లి పోలీస్‌స్టేషన్‌లో ఎస్పీ రోహిత్ రాజు వార్షిక తనిఖీలు

(మొదటి పేజీ తరువాయి...)

రిజిస్టర్లు, పెండింగ్ కేసుల వివరాలను క్షుణ్ణంగా పరిశీలించారు. రికార్డులను ఎప్పటికప్పుడు నిబద్ధతతో, పకడ్బందీగా అప్‌డేట్ చేయాలని సిబ్బందిని ఆదేశించారు. స్టేషన్ పరిసరాలతో పాటు మౌలిక వసతులను పరిశీలించిన ఎస్పీ, ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులపై అత్యంత స్పందనతో వ్యవహరించాలని సూచించారు. బాధితులకు సత్వర న్యాయం జరిగేలా సిబ్బంది బాధ్యతాయుతంగా పనిచేయాలని కోరారు. శాంతిభద్రతల పరిరక్షణలో ఎలాంటి అలసత్వం ప్రదర్శించినా సహించేది లేదని హెచ్చరించారు. మండలంలో రాత్రివేళ గస్తీని ముమ్మరం చేయాలని, పెండింగ్‌లో ఉన్న నాన్ బెయిలబుల్ వారెంట్లను వేగంగా అమలు చేయాలని పోలీసు అధికారులకు స్పష్టమైన దిశానిర్దేశం చేశారు. నేరాల నియంత్రణతో పాటు ప్రజలకు మెరుగైన పోలీస్ సేవలు అందించేందుకు సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జూలూరుపాడు సీఐ శ్రీలక్ష్మి, ఎస్సై విజయ్ సింహారెడ్డి, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

- **40 మందికి పైగా విద్యార్థినులకు కాటు?**
- **కొందరికి భద్రాచలం ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స**
- **ఈ నెల 9న కొందరికి ఇంజక్షన్లు?**
- **160 మంది విద్యార్థినుల భద్రతపై ఆందోళన**
- **వసతి గృహంలో విపరీతంగా ఎలుకల సంచారం**
- **ఆసుపత్రి రికార్డుల్లో కళాశాల పేరు లేకుండా జాగ్రత్తలు ?**
- **ఘటనను గోప్యంగా ఉంచుతున్నారన్న ప్రచారం**




### సారపాక మైనారిటీ కళాశాలలో..

# ఎలుకల దాడి?!

**సారపాకలోని తెలంగాణ రాష్ట్ర మైనారిటీ రెసిడెన్షియల్ విద్యా సంస్థల సొసైటీకి చెందిన కళాశాల వసతి గృహంలో ఎలుకల బెడద తీవ్రంగా ఉన్నట్లు విశ్వసనీయ సమాచారం అందుతోంది. సుమారు 160 మంది విద్యార్థినులు ఉంటున్న వసతి గృహంలో ఇప్పటికే 40 మందికి పైగా విద్యార్థినులను ఎలుకలు కరిచినట్లు తెలుస్తోంది. కాటుకు గురైన వారిలో కొందరికి గాయాల తీవ్రత ఎక్కువగా ఉండటంతో భద్రాచలం ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లి వైద్యుల సూచన మేరకు ఇంజక్షన్లు ఇప్పిస్తున్నట్లు సమాచారం.**

భద్రాద్రి కొత్తగూడెం ప్రతినిధి / బూర్గంపాడు, ప్రజాజ్యోతి

ఈ నెల 9న కూడా కొందరు విద్యార్థినులు భద్రాచలం ప్రభుత్వ ఆసుపత్రిలో ఇంజక్షన్లు తీసుకున్నట్లు విశ్వసనీయ వర్గాల ద్వారా తెలిసింది. అయితే ఈ వివరాలను సంబంధిత అధికారులు అధికారికంగా నిర్ధారించాల్సి ఉంది.

### 160 మంది విద్యార్థినుల భద్రతపై ప్రశ్నలు

ఈ వసతి గృహంలో ఎలుకల సంచారం అధికంగా ఉండటంతో విద్యార్థినులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు తెలుస్తోంది. రాత్రి వేళల్లో గదుల్లోకి ఎలుకలు వస్తున్నట్లు, ఈ క్రమంలో పలువురు విద్యార్థినులు కాటుకు గురైనట్లు సమాచారం. గత నెల రోజుల వ్యవధిలోనే 40 మందికి పైగా విద్యార్థినులు ఎలుకల కాటుకు గురైనట్లు విశ్వసనీయ వర్గాల సమాచారం. అయితే ఈ విషయం బయటకు రాకుండా కళాశాల సిబ్బంది గోప్యత పాటిస్తున్నట్టు తెలుస్తోంది. కాటుకు గురైన వారిలో కొందరిని భద్రాచలం ప్రభుత్వ ఆసుపత్రికి పంపిస్తున్న సమయంలో ఉపాధ్యాయులు కూడా వాలకు జాగ్రత్తలు చెబుతున్నట్లు కూడా సమాచారం. అయితే ఇంతమంది విద్యార్థినులు కాటుకు గురైనట్లు సమాచారం వస్తున్న నేపథ్యంలో వసతి గృహంలో పారిశుధ్య పరిస్థితులు ఎలా ఉన్నాయి? ఎలుకల సంచారానికి కారణమేంటి? వాటి నియంత్రణకు యాజమాన్యం ఇప్పటి వరకు ఎలాంటి చర్యలు చేపట్టింది? అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. వసతి గదులు, వంటశాల, ఆహార నిల్వ ప్రాంతాలు, పరిసరాలను అధికారులు పరిశీలించి సమస్యకు మూల కారణాలను గుర్తించాల్సిన అవసరం ఉంది.

### పిల్లల పరిస్థితి ఏమిటో...

సాధారణంగా ఆడపిల్లలు చిన్న పురుగుకే భయపడుతారు. ఆలాంటిది ఎలుకలు కోరుకుతున్నయంటే అసలు వాళ్ళ పరిస్థితి ఏమిటో అన్నది తెలియాల్సి ఉంది. మరోవైపు ఎలుకల కాటుకు గురైన విద్యార్థినులందరికీ వైద్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన చికిత్సను వైద్యుల సూచన మేరకు అందించాల్సిన అవసరం ఉంది. ఎలుక కాటు జరిగినంత మాత్రాన రేబిస్ సోకుతుందని చెప్పలేం. అయితే కాటు తీవ్రతను బట్టి అవసరమైన వైద్య, నిరోధక చర్యలను వైద్యులే నిర్ణయించాలి. విద్యార్థినుల ఆరోగ్యం, భద్రతకు సంబంధించిన అంశం కావడంతో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ, సంబంధిత అధికారులు వెంటనే స్పందించి వాస్తవ పరిస్థితిని నిర్ధారించాల్సిన అవసరం ఉంది. 40 మందికి పైగా విద్యార్థినులు ఎలుకల కాటుకు గురైనట్లు వస్తున్న సమాచారం నిజమైతే.. ఇది సాధారణ పారిశుధ్య సమస్యగా కొట్టిపారేయలేని విషయం. ఘటనపై సమగ్రంగా వివరాలు సేకరించి, బాధిత విద్యార్థినుల సంఖ్య, వారికి అందుతున్న వైద్య సేవలు, వసతి గృహంలోని పారిశుధ్య పరిస్థితులు, ఎలుకల నియంత్రణకు చేపట్టిన చర్యలను అధికారులు పరిశీలించాలి. విద్యార్థినుల భద్రతకు ఎలాంటి ముప్పు లేకుండా తక్షణ చర్యలు చేపట్టడంతో పాటు, ఈ ఘటనపై నెలకొన్న అనుమానాలకు కూడా సంబంధిత అధికారులు స్పష్టత ఇవ్వాల్సిన అవసరం ఉంది.

### ఆసుపత్రి రికార్డుల్లో కళాశాల పేరు ఎందుకు లేదు?

ఈ వ్యవహారంలో మరో అంశం ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. ఎలుకల కాటుకు గురైన విద్యార్థినులు భద్రాచలం ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లినప్పుడు వారి వివరాల్లో కళాశాల పేరును నమోదు చేయకుండా 'సారపాక నివాసి'గా మాత్రమే నమోదు చేస్తున్నట్లు సమాచారం. ఈ నెల 9న ఆసుపత్రికి వెళ్లిన కొందరు విద్యార్థినుల వివరాల్లోనూ ఇదే విధంగా నమోదు చేసినట్లు తెలుస్తోంది. దీంతో ఆసుపత్రి రికార్డులతో పాటు ఇతర వివరాల్లోనూ కళాశాల పేరు బయటకు రాకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నారన్న సమాచారం పలు అనుమానాలకు తావిస్తోంది. అయితే దీనికి కారణమేంటన్నది స్పష్టంగా తెలియడం లేదు. ఇది సాధారణ నమోదు విధానమా? లేక ఘటన వివరాలు బయటకు రాకుండా తీసుకుంటున్న చర్యా? అన్నది సంబంధిత అధికారులు స్పష్టం చేయాల్సి ఉంది.



# అర్హత లేని వారికి అందలమా?

- లైసెన్స్ లేనివారికే చికెన్ వ్యర్థాల కాంట్రాక్టా?
- కాంట్రాక్టర్‌కు సొంత వాహనం ఉందా? GPS ట్రాకర్ ఉందా?
- ట్రేడ్ లైసెన్స్ ఉంటే చూపించరెందుకు?
- ప్రాసెసింగ్ యూనిట్ ఎక్కడ? మున్సిపల్ కమిషనర్ మౌనం వెనుక మర్మమేంటి?



**అశ్వరావుపేట: ప్రజా జ్యోతి సెప్టెంబర్ 11** మున్సిపాలిటీలో చికెన్ వ్యర్థాల సేకరణ, తరలింపు, నిర్వహణకు సంబంధించిన కాంట్రాక్ట్ వ్యవహారం ఇప్పుడు పలు ప్రశ్నలకు తావిస్తోంది. ప్రజల ఆరోగ్యం, పారిశుద్ధ్యం, పర్యావరణ భద్రతకు నేరుగా సంబంధించిన అంశంలో నిబంధనలు పాటిస్తున్నారా? లేక కేవలం కాంట్రాక్ట్ అప్పగింతతోనే బాధ్యత ముగిసిపోయిందా? అనే సందేహాలు ప్రజల్లో వ్యక్తమవుతున్నాయి.

**చికెన్ వ్యర్థాలను సేకరించే వ్యక్తికి చెల్లుబాటు అయ్యే ట్రేడ్ లైసెన్స్ ఉందా?**

ఉంటే దాని వివరాలను మున్సిపాలిటీ బహిర్గతం చేయాల్సిన అవసరం లేదా? కాంట్రాక్ట్ దక్కించుకున్న వ్యక్తికి వ్యర్థాల రవాణాకు అనువైన సొంత వాహనం ఉందా? ఆ వాహనాలకు GPS ట్రాకింగ్ వ్యవస్థ ఉందా? అనే ప్రశ్నలు కూడా వినిపిస్తున్నాయి.

**ప్రాసెసింగ్ యూనిట్ ఎక్కడ?**

చికెన్ వ్యర్థాలను సేకరించిన తర్వాత వాటిని ఎక్కడికి తరలిస్తున్నారు? వాటి శాస్త్రీయ ప్రాసెసింగ్‌కు అనుమతులు పొందిన ప్రాసెసింగ్ యూనిట్ ఎక్కడ ఉంది? ఆ యూనిట్‌కు సంబంధించిన అనుమతులు, స్థలం, సామర్థ్యం, వ్యర్థాల నిర్వహణ విధానం వంటి వివరాలు టెండర్ పత్రాల్లో ఉన్నాయా? ఉంటే ప్రజలకు ఎందుకు అందుబాటులో లేవన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి.వ్యర్థాలను ఎక్కడపడితే అక్కడ పారవేస్తే దుర్వాసన, దోమలు, కుక్కలు, ఇతర జంతువుల బెడదతో పాటు ప్రజారోగ్యానికి ముప్పు ఏర్పడే అవకాశం ఉంది. అందుకే మున్సిపాలిటీ ఈ వ్యవహారాన్ని పారదర్శకంగా నిర్వహించాల్సిన అవసరం ఉంది.

**డబ్బే ముఖ్యమా? ప్రజల ఆరోగ్యం అవసరం లేదా?**

కాంట్రాక్ట్ ద్వారా మున్సిపాలిటీకి ఆదాయం రావడం ఒక అంశం. కానీ ప్రజల ఆరోగ్యం, పారిశుద్ధ్యం, పర్యావరణ పరిరక్షణ అంతకంటే ముఖ్యమైన అంశం. నిబంధనలు పూర్తిగా పరిశీలించకుండానే కాంట్రాక్ట్ అప్పగించారా? అన్నది అధికారులే స్పష్టం చేయాలి.మున్సిపల్ కమిషనర్ సమాధానం చెప్పాల్సిన ప్రశ్నలుకాంట్రాక్ట్ దక్కించుకున్న వ్యక్తికి ట్రేడ్ లైసెన్స్ ఉందా?వ్యర్థాల రవాణాకు ఉపయోగించే వాహనాల వివరాలు.

**GPS ట్రాకింగ్ వ్యవస్థ ఉన్నాయా?**

**చికెన్ వ్యర్థాలను తరలించే ప్రాసెసింగ్ యూనిట్ ఎక్కడ ఉంది?**

**ఆ యూనిట్‌కు సంబంధిత శాఖల అనుమతులు ఉన్నాయా?**

**టెండర్‌లో పేర్కొన్న నిబంధనలను కాంట్రాక్టర్ పూర్తిగా పాటిస్తున్నారా?**

**నిబంధనలు ఉల్లంఘిస్తే కాంట్రాక్ట్ రద్దు చేసే నిబంధనలు ఉన్నాయా?**

# దోచుకునోడికి దోచుకున్నంత?

- మౌనానికి ముడుపులే కారణమా?
- హెచ్‌పీ గ్యాస్ సబ్ ఏజెన్సీపై వరుస కథనాలు... అయినా సివిల్ సప్లై అధికారులకు చలనం లేదా?
- సీజ్ చేయాల్సింది పోయి సర్దుబాట్లేంటి?
- "ఏజెన్సీ వాళ్లతో మాట్లాడతాం... సఖి పాయింట్ వస్తే క్రమబద్ధీకరిస్తాం, లేదంటే తీసేస్తాం" -డీటీ ప్రభాకర్‌రావు



**అశ్వరావుపేట: ప్రజా జ్యోతి సెప్టెంబర్ 11** హెచ్‌పీ గ్యాస్ సబ్ ఏజెన్సీ నిర్వహణపై అనుమతులు, నిబంధనలకు సంబంధించి వరుస ఆరోపణలు, కథనాలు వెలువడుతున్నా సంబంధిత సివిల్ సప్లై అధికారుల్లో మాత్రం ఆశించిన స్థాయిలో స్పందన కనిపించడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రజల భద్రతకు సంబంధించిన గ్యాస్ వ్యవహారంపై అధికారులు ఎందుకు స్పష్టమైన చర్యలు తీసుకోవడం లేదన్నది ఇప్పుడు ప్రధాన ప్రశ్నగా మారింది.

**ఈ వ్యవహారంపై డీటీ ప్రభాకర్‌రావును ప్రశ్నించగా**

"సారపాకలో ఉన్న ఏజెన్సీ వాళ్లతో మాట్లాడతాం. సఖి పాయింట్ వస్తే క్రమబద్ధీకరిస్తాం, లేదంటే తీసేస్తాం" అంటూ వారం రోజుల గడువు కోరినట్లు సమాచారం.అయితే ఇక్కడే అసలు ప్రశ్న మొదలవుతోంది. నిబంధనలకు విరుద్ధంగా పాయింట్ నడుస్తున్నట్లు అనుమానం ఉంటే ముందుగా తనిఖీ చేయాలా? లేక సంబంధిత ఏజెన్సీ ప్రతినిధులతో మాట్లాడి క్రమబద్ధీకరణకు అవకాశం ఇవ్వాలా? అన్నది ఉన్నతాధికారులు స్పష్టం చేయాలి.

**సీజ్ చేసే అధికారం లేదా?**

గ్యాస్ వంటి అత్యంత సున్నితమైన ఉత్పత్తి విషయంలో అనుమతులు, నిల్వ, రవాణా, పంపిణీ, భద్రతా నిబంధనలపై అధికారులు తనిఖీలు నిర్వహించాల్సి ఉంటుంది.అయితే నిబంధనల ఉల్లంఘన ఉన్నట్లు తేలితే స్థానిక డీటీకి ఏ మేరకు చర్యలు తీసుకునే అధికారం ఉంది? అధికారం లేకపోతే పై అధికారులకు నివేదిక ఇచ్చారా? అధికారం ఉంటే ఇప్పటివరకు చర్యలు ఎందుకు తీసుకోలేదన్న ప్రశ్నలకు సమాధానం కావాలి.

**సీజ్ చేయాల్సిన చోట సర్దుబాట్లు ఎందుకు?**

"మాట్లాడతాం... క్రమబద్ధీకరిస్తాం... లేదంటే తీసేస్తాం" అనే విధానం ప్రజల్లో మరిన్ని అనుమానాలకు తావిస్తోంది. నిబంధనలు ఉల్లంఘించిన వ్యాపార నిర్వహణను ముందుగా నిలిపివేసి విచారణ చేయాలా? లేక తర్వాత అనుమతులు తెచ్చుకునే అవకాశం కల్పించాలా? దీనిపై జిల్లా స్థాయి అధికారులు స్పష్టత ఇవ్వాలి.ఒక్క సిలిండర్ ధర రూ.2,000–3,000నా?స్థానికంగా వినిపిస్తున్న ఆరోపణల్లో మరో తీవ్ర అంశం సిలిండర్ల అధిక ధర. ఒక్కో సిలిండర్‌ను రూ.2,000 నుంచి రూ.3,000 వరకు విక్రయిస్తున్నారన్న ఆరోపణలు నిజమా? నిజమైతే వినియోగదారులపై ఇంతటి అదనపు భారం ఎందుకు పడుతోంది? అలాగే సిలిండర్లు బ్లాక్ మార్కెట్‌కు తరలిస్తున్నారన్న ఆరోపణల్లో వాస్తవం ఎంత? అధికారులు ఇప్పటివరకు ఎలాంటి తనిఖీలు నిర్వహించారు? స్టాక్ రిజిస్టర్లు, విక్రయ రికార్డులు, వినియోగదారుల వివరాలు పరిశీలించారా?ఇవి కేవలం ఆరోపణలుగానే మిగలకుండా సంబంధిత అధికారులు రికార్డులను పరిశీలించి వాస్తవాలను ప్రజల ముందు ఉంచాల్సిన అవసరం ఉంది.ముడుపుల ఆరోపణలపై విచారణ ఎక్కడ?చర్యలు ఎందుకు ఆలస్యమవుతున్నాయన్న దానిపై ప్రజల్లో అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ముడుపులు అందుతున్నాయనే ఆరోపణలు నిజమా? లేక అధికారులపై వస్తున్న అనుమానాలకు ఎలాంటి ఆధారం లేదా? అన్నది విచారణతో తేల్చాల్సిన బాధ్యత ఉన్నతాధికారులపై ఉంది.ఆరోపణలు నిజమైతే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలి. ఆరోపణలు నిరాధారమైతే అధికారికంగా వివరాలు వెల్లడించి ప్రజల్లో ఉన్న అనుమానాలను నివృత్తి చేయాలి.జిల్లా సివిల్ సప్లై అధికారులారా... సమాధానం చెప్పండి!హెచ్‌పీ గ్యాస్ సబ్ ఏజెన్సీకి చెల్లుబాటు అయ్యే అనుమతులు ఉన్నాయా?అనుమతులు ఉంటే ఏ నిబంధనల ప్రకారం మంజూరు చేశారు? ఒక్కో సిలిండర్ రూ.2,000–3,000 వరకు విక్రయిస్తున్నారన్న ఆరోపణలపై తనిఖీ చేశారా?సిలిండర్లు బ్లాక్ మార్కెట్‌కు తరలుతున్నాయన్న ఆరోపణలపై విచారణ చేశారా?డీటీకి తనిఖీ, సీజ్ లేదా నివేదిక చేసే అధికార పరిధి ఎంతవరకు ఉంది?నిబంధనల ఉల్లంఘన ఉంటే వెంటనే చర్యలు ఎందుకు తీసుకోలేదు?సారపాక ఏజెన్సీ ప్రతినిధులతో మాట్లాడి క్రమబద్ధీకరించడం ఏ నిబంధన కింద సాధ్యం?ఇప్పటివరకు ఎన్ని తనిఖీలు నిర్వహించారు?ముడుపుల ఆరోపణలపై ఉన్నతాధికారులు స్వతంత్ర విచారణకు సిద్ధమా?

**ప్రజల ప్రాణాల కంటే... సర్దుబాట్లే ముఖ్యమా?**

గ్యాస్ విషయంలో చిన్న నిర్లక్ష్యం కూడా పెద్ద ప్రమాదానికి దారితీసే అవకాశం ఉంది. అందుకే "మాట్లాడతాం... చూస్తాం..." అనే సమాధానాలు కాకుండా, నిబంధనల ప్రకారం తనిఖీలు, రికార్డుల పరిశీలన, అవసరమైన చర్యలు ఉండాలని ప్రజలు కోరుతున్నారు.

## శ్రీ చైతన్య పాఠశాలలో వినాయక చవితి వేడుకలు

- కులమతాలకు అతీతంగా అన్ని మతాలను గౌరవించాలని ప్రిన్సిపాల్ పిలుపు



**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా క్రైమ్ ప్రతినిధి /మణుగూరు. సెప్టెంబర్ 11 ప్రజా జ్యోతి** మణుగూరు మండలం గుట్టమల్లారంలోని శ్రీ చైతన్య పాఠశాలలో శుక్రవారం వినాయక చవితి సంబరాలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ షాహిన్ మాట్లాడుతూ కుల మతాలకు అతీతంగా పాఠశాల స్థాయి నుండే విద్యార్థులను అన్ని మతాలను గౌరవించే విధంగా తీర్చిదిద్దాలన్నారు. రాబోయే తరాన్ని దృష్టిలో ఉంచుకొని పర్యావరణ పరిరక్షణ కోసం అందరూ మట్టి వినాయక విగ్రహాలనే ప్రతిష్టించాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో అకాడమిక్ డీన్ భాస్కర్ రెడ్డి, ప్రైమరీ ఇన్చార్జి నస్రీన్, పీటీ ఇన్చార్జి వెంకటరమణ, ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## మొక్కలతోనే మానవాళికి మనుగడ సాధ్యం

- మొక్కలను పంపిణీ చేసిన చైర్ పర్సన్, వార్డు కౌన్సిలర్







**ఇల్లందు, సెప్టెంబర్ 11 (ప్రజా జ్యోతి)** మొక్కల పెంపకంతోనే పర్యావరణ పరిరక్షణ సాధ్యమవుతుందని, మొక్కలతోనే మానవాళికి మనుగడ అని ఇల్లందు మున్సిపల్ చైర్‌పర్సన్ దొడ్డ కిరణ్ మిత్ర డానియల్, 13వ వార్డు కౌన్సిలర్ దండు సారయ్య లు అన్నారు. రాష్ట్రప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మక చేపట్టిన వనమహోత్సవం కార్యక్రమంలో భాగంగా 13వ వార్డులో మొక్కలను పంపిణీ చేశారు. వారు మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని కోరారు. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటడంతో పాటు వాటిని సంరక్షించే బాధ్యతను కూడా తీసుకోవాలని సూచించారు. పెరుగుతున్న కాలుష్యం, వాతావరణ మార్పుల నేపథ్యంలో పచ్చదనం పెంపొందించాల్సిన అవసరం ఉందన్నారు. ఇళ్ల పరిసరాలు, ఖాళీ ప్రదేశాలు, ప్రభుత్వ స్థలాలు, పాఠశాలలు, కార్యాలయాల పరిసరాల్లో విరివిగా మొక్కలు నాటాలని సూచించారు. నాటిన మొక్కలకు క్రమం తప్పకుండా నీరు పోస్తూ సంరక్షిస్తేనే భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన వాతావరణాన్ని అందించవచ్చని తెలిపారు. పెరుగుతున్న కాలుష్యాన్ని నియంత్రించాలంటే మొక్కలను నాటాలని కోరారు. ప్రకృతిని కాపాడడం ఒక్క ప్రభుత్వ శాఖల బాధ్యత కాదని, ప్రజలందరి బాధ్యత అని తెలిపారు. పచ్చదనం పెంపొందించేందుకు స్థానిక ప్రజలు, యువత, మహిళలు, విద్యార్థులు ముందుకు రావాలని కోరారు. అనంతరం 13వ వార్డు కౌన్సిలర్ దండు సారయ్య ఇంటింటికి తిరుగుతూ మొక్కల ను అందజేశారు. ఈ కార్యక్రమంలో వార్డు ఆఫీసర్, సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

## పెద్దమ్మ తల్లి అమ్మవారికి వైభవంగా పంచామృతాభిషేకం



**పాల్వంచ సెప్టెంబర్ 11,(ప్రజా జ్యోతి )** పాల్వంచ మండల పరిధిలోని కెపి జగన్నాథపురం గ్రామంలో కొలువు తీరిన పెద్దమ్మ తల్లి అమ్మవారికి ప్రతి శుక్రవారం మాదిరిగా వైభవంగా పంచామృతాలతో పూజా కార్యక్రమాన్ని నిర్వహించారు, ముందుగా మేల తాళాలతో ఆలయ అర్చకులు ,భక్తులు జన్మస్థలం వద్ద అమ్మవారికి పంచామృతాలు, పసుపు ,కుంకుమ, గాజులు ,హారతి సమర్పించిన అనంతరం ఆలయంలోని అమ్మవారి మూలవిరాట్ కు పంచామృతాలతో ఆలయ అర్చకులు అభిషేకం నిర్వహించారు, అనంతరం పంచహారతులు, నివేదన ,నీరాజన, మంత్రపుష్పం తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించారు ,ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు సిబ్బంది పాల్గొన్నారు.

## గణేష్ ఉత్సవాలపై సీఐ సమావేశం

- పట్టణంలో ప్రశాంతంగా నిర్వహించాలని సూచన
- గణేష్ నిర్వాహకులకు పోలీసుల దిశానిర్దేశం..! నిబంధనలు తప్పనిసరిగా పాటించాలి
- భద్రతా చర్యలపై సీఐ నాగబాబు ఆదేశాలు





**మణుగూరు క్రైమ్, సెప్టెంబర్ 11 (ప్రజా జ్యోతి):** మణుగూరు మండలంలో గణేష్ ఉత్సవాల నిర్వహణపై మణుగూరు పోలీసులు అప్రమత్తమయ్యారు. శుక్రవారం మణుగూరు పోలీస్ స్టేషన్ లో గణేష్ ఉత్సవాల నిర్వాహకులతో సీఐ నాగబాబు సమావేశం నిర్వహించారు. ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో, ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా నిర్వహించాలని నిర్వాహకులకు సూచించారు. డీజే సౌండ్ విషయంలో, విద్యుత్ అలంకరణల విషయంలో తీసుకోవాల్సిన భద్రతా చర్యలు, జాగ్రత్తలపై దిశానిర్దేశం చేశారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులకు సహకరించాలని కోరారు. ఈ సమావేశంలో ఎస్సైలు నగేష్ కుమార్, రవూఫ్ పాల్గొన్నారు.

## ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఘనంగా ఫ్రెషర్స్ డే వేడుకలు

- విద్యార్థి జీవితంలో డిగ్రీ విద్య ఒక కీలకమైన మలుపు
- ప్రతి విద్యార్థిలోనూ ప్రత్యేకమైన ప్రతిభ దాగి ఉంటుంది
- విద్యార్థులు ఉన్నత లక్ష్యాలతో ముందుకు సాగాలి
- కళాశాల ప్రిన్సిపాల్ : ప్రొఫెసర్ యర్నం చిన్నప్పయ్య









**మణుగూరు, సెప్టెంబర్ 11 (ప్రజా జ్యోతి) :** మండల పరిధిలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నూతన విద్యార్థులకు స్వాగతం పలుకుతూ ఫ్రెషర్స్ డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. కళాశాల ప్రాంగణంలో శుక్రవారం నూతన విద్యార్థులకు కళాశాల వాతావరణాన్ని పరిచయం చేస్తూ వారిలో ఆత్మవిశ్వాసం, స్ఫూర్తి, విద్య పట్ల ఆసక్తిని పెంపొందించే విధంగా కళాశాల అధ్యాపక సిబ్బంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ యర్నం చిన్నప్పయ్య మాట్లాడుతూ విద్యార్థి జీవితంలో డిగ్రీ విద్య ఒక కీలకమైన మలుపు అని అన్నారు. నూతన విద్యార్థులు కళాశాలలో లభించే విద్యా అవకాశాలను పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకుని తమ భవిష్యత్తుకు బలమైన పునాది వేసుకోవాలని సూచించారు.విద్యార్థులు కేవలం పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించడమే లక్ష్యంగా కాకుండా, ఉన్నత ఫలితాలు సాధించడం, ఉన్నత విద్యను అభ్యసించడం, పోటీ పరీక్షల్లో విజయం సాధించడం, మంచి ఉద్యోగ అవకాశాలను అందిపుచ్చుకోవడం వంటి లక్ష్యాలను నిర్దేశించుకోవాలని తెలిపారు. ప్రతి విద్యార్థిలోనూ ప్రత్యేకమైన ప్రతిభ దాగి ఉంటుందని, దానిని గుర్తించి నిరంతర కృషి ద్వారా వెలికితీయాలని సూచించారు. జీవితంలో విజయం సాధించాలంటే కలలు కనడం మాత్రమే కాదు ఆ కలలను లక్ష్యాలుగా మార్చుకుని, వాటిని సాధించే వరకు నిరంతరం శ్రమించాలని ఉపోద్ఘాటించారు. సమయపాలన, క్రమశిక్షణ, పట్టుదల, ఆత్మవిశ్వాసం విజయానికి మూలస్తంభాలు అని ప్రిన్సిపాల్ విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. కళాశాలలోని ప్రతి తరగతి గదిని విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దే వేదికగా మార్చేందుకు అధ్యాపకులు కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. విద్యార్థులు అధ్యాపకులతో నిరంతరం సంప్రదింపులు కొనసాగిస్తూ, తమ సందేహాలను నివృత్తి చేసుకోవాలని అంతేకాకుండా పాఠ్యాంశాలతో పాటు కమ్యూనికేషన్ స్కిల్స్, కంప్యూటర్ పరిజ్ఞానం, సాంకేతిక నైపుణ్యాలు, జనరల్ నాలెడ్జ్ వంటి అంశాలను అభివృద్ధి చేసుకోవాలని సూచించారు. ఈరోజు మీరు నూతన విద్యార్థులుగా కళాశాలలో అడుగుపెడుతున్నారు, రేపు ఈ కళాశాల నుంచి మీ విజయగాథలను సమాజం గుర్తించే స్థాయికి ఎదగాలని హితవు పలికారు. మీలో ప్రతి ఒక్కరూ ఒక ప్రత్యేకమైన లక్ష్యాన్ని ఏర్పరచుకుని, దానిని సాధించే దిశగా అడుగులు వేయాలని అభిలాషించారు.విద్యార్థులు తమ తల్లిదండ్రుల ఆశలను నెరవేర్చడంతో పాటు, కళాశాలకు మంచి పేరు తీసుకురావాలని, భవిష్యత్తులో ఉన్నత స్థానాలను అధిరోహించి సమాజానికి సేవ చేసే బాధ్యతాయుతమైన పౌరులుగా ఎదగాలని ప్రిన్సిపాల్ ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు. అనంతరం విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించడం జరిగింది.

## ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించడమే లక్ష్యం

- వైద్యాధికారులు ఆసుపత్రి సమయపాలన, మందుల లభ్యత, వైద్య శిబిరాలపై ప్రత్యేక దృష్టి సారించాలి
- డి ఎం అండ్ హెచ్ ఓ తుకారామ్ రాథోడ్



**కొత్తగూడెం కలెక్టరేట్, సెప్టెంబర్ 11 ,(ప్రజా జ్యోతి )** కొత్తగూడెం జిల్లాలో ప్రజలకు నిరంతరాయంగా నాణ్యమైన వైద్య సేవలు అందించేందుకు వైద్యాధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని జిల్లా వైద్య , ఆరోగ్య అధికారి డా. తుకారామ్ రాథోడ్ సూచించారు. శుక్రవారం జిల్లాలోని అన్ని వైద్యాధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించి వివిధ ఆరోగ్య కార్యక్రమాల అమలు, ఆసుపత్రుల పనితీరు, మాతా–శిశు ఆరోగ్యం, అసంక్రమిత వ్యాధుల నియంత్రణ తదితర అంశాలపై సమగ్రంగా సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆసుపత్రుల్లో వైద్యులు, సిబ్బంది తప్పనిసరిగా సమయపాలన పాటించాలన్నారు, ప్రభుత్వ సెలవు రోజుల్లో కూడా ప్రజలకు అత్యవసర వైద్య సేవలు అందేలా సగం రోజు ఆసుపత్రులను నిర్వహించాలని, ఇందుకోసం సిబ్బందికి విధులు కేటాయించాలని ఆదేశించారు. అనంతరం ఎన్ సి డి స్క్రీనింగ్‌పై ప్రత్యేక దృష్టి డా. దినేష్, పి ఓ _ ఎన్ సి డి అసంక్రమిత వ్యాధుల కార్యక్రమంపై సమీక్ష నిర్వహించారు. జిల్లాలో నిర్దేశించిన లక్ష్యాల మేరకు ఎన్ సి డి స్క్రీనింగ్‌ను పూర్తి చేయాలని సూచించారు. ముఖ్యంగా రక్తపోటు, మధుమేహం ఉన్న రోగులను గుర్తించి, వారికి ప్రతి నెలా క్రమం తప్పకుండా ఫాలోఅప్, ఆరోగ్య పరీక్షలు నిర్వహించాలని తెలిపారు. గుర్తించిన రోగులకు అవసరమైన చికిత్స, మందులు , తదుపరి వైద్య సేవలు నిరంతరంగా అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అదేవిధంగా గర్భిణీల ఆరోగ్యంపై డా. రాకేష్, పి ఓ _ ఎం హెచ్ ఎన్ మాతా–శిశు ఆరోగ్య కార్యక్రమాలపై సమీక్ష నిర్వహించారు. ప్రతి గర్భిణీకి ఏ ఎన్ సి నమోదు, నిర్ణీత సమయంలో ఆరోగ్య పరీక్షలు, క్రమం తప్పకుండా ఫాలోఅప్ నిర్వహించాలని సూచించారు. ప్రసవానికి ముందుగానే ప్రతి గర్భిణీకి బర్త్ ప్లాన్ చేయాలని, ముఖ్యంగా అధిక ప్రమాద గర్భిణీలను గుర్తించి ప్రత్యేక పర్యవేక్షణలో ఉంచాలని తెలిపారు. ఈ డి డి కి కనీసం మూడు రోజుల ముందుగానే అవసరమైన ప్రసవ ప్రణాళికను సిద్ధం చేసి, అవసరమైన గర్భిణీలను ముందస్తుగా ప్రత్యేక వార్డులకు తరలించేలా చర్యలు చేపట్టాలని సూచించారు. అలాగే గర్భిణీలకు రక్తహీనత, హెచ్ఐవి సంబంధిత స్క్రీనింగ్‌లను తప్పనిసరిగా నిర్వహించి ఫలితాలను నమోదు చేయాలని ఆదేశించారు. అనంతరం గట్టు మల్లలోని ఐ డి ఓ ఆసుపత్రిని లక్ష్మీదేవిపల్లి మండలంలోని పీహెచ్సీ పరిధిలో ఉన్న ఐడిఓ వైద్యశాలను ఆకస్మికంగా తనిఖీ చేసి ఆసుపత్రి సేవలు, సిబ్బంది పనితీరు , అందుబాటులో ఉన్న వైద్య సదుపాయాలను పరిశీలించారు. ఆసుపత్రికి వచ్చే రోగులకు సకాలంలో వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందించాలన్నారు, అనంతరం పాల్వంచలోని నర్సింగ్ అధికారులతో ప్రత్యేక సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లాలోని హై రిస్క్ ఏ ఎన్ సి కేసులు, వాటి ఫాలోఅప్, ప్రసవ ప్రణాళిక తదితర అంశాలను సమీక్షించారు. అధిక ప్రమాద గర్భిణీలను నిర్లక్ష్యం చేయకుండా నిరంతరం పర్యవేక్షిస్తూ, నిర్ణీత సమయంలో వైద్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన సందర్భాల్లో ఉన్నత వైద్య కేంద్రాలకు రిఫర్ చేయాలని సూచించారు. ఈ సమావేశంలో జిల్లాలోని వివిధ పీహెచ్సీలకు చెందిన వైద్యాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు

## కందిపాడులో కార్డన్ సెర్చ్ ఆపరేషన్

- ఆదివాసీలకు అండగా పోలీసు శాఖ-డీఎస్పీ అరుణ్ కుమార్

**చర్ల, సెప్టెంబర్ 11 :(ప్రజాజ్యోతి):** జిల్లా ఎస్పీ రోహిత్ రాజు, ఐపీఎస్ ఆదేశాల మేరకు భద్రాచలం డీఎస్పీ అరుణ్ కుమార్ శుక్రవారం చర్ల మండలంలోని ఆదివాసీ వలస గ్రామమైన కందిపాడులో కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్ నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామాన్ని సందర్శించిన డీఎస్పీ స్థానిక ప్రజలతో మాట్లాడి గ్రామంలోని సమస్యలు, ప్రజల పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు.గ్రామంలో అక్రమంగా గుడుంబా తయారీ, విక్రయాలకు పాల్పడవద్దని ప్రజలకు సూచించారు. గుడుంబా వల్ల కుటుంబాలపై, ముఖ్యంగా యువతపై పడే దుష్ప్రభావాలను వివరించారు. అక్రమ గుడుంబా తయారీ, విక్రయాలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.యువత, చిన్నారులు విద్యపై ప్రత్యేక దృష్టి సారించి ఉన్నత లక్ష్యాలను సాధించాలని డీఎస్పీ సూచించారు. గ్రామంలో ఎలాంటి అసాంఘిక కార్యకలాపాలు జరిగినా వెంటనే పోలీసుల దృష్టికి తీసుకురావాలని ప్రజలు పోలీసు శాఖకు సహకరించాలని కోరారు.అనంతరం డీఎస్పీ అరుణ్ కుమార్, చర్ల సీఐ రాజు వర్మ స్థానిక విద్యార్థులకు దుస్తులను పంపిణీ చేశారు. మారుమూల ఆదివాసీ గ్రామాల ప్రజలకు పోలీసు శాఖ అండగా ఉంటుందనే భరోసా కల్పించడంతో పాటు విద్యార్థులను విద్యలో ప్రోత్సహించడమే కార్యక్రమం ఉద్దేశమని తెలిపారు.ఈ కార్యక్రమంలో సీఐ రాజు వర్మ, ఎస్సైలు నర్సిరెడ్డి, కేశవ్, పోలీస్ స్టేషన్ సిబ్బంది, స్పెషల్ పార్టీ సిబ్బంది పాల్గొన్నారు.



# భూ రీ సర్వేను వేగవంతంగా పూర్తి చేయాలి

- అదనపు కలెక్టర్ డి. వేణుగోపాల్



**కొత్తగూడెం కలెక్టరేట్, సెప్టెంబర్ 11, (ప్రజాజ్యోతి)** కొత్తగూడెం మండలం చిట్టిరామవరం తండాలో జరుగుతున్న భూ రీ సర్వే పనులను శుక్రవారం అదనపు కలెక్టర్ డి. వేణుగోపాల్ పరిశీలించారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, పరికరాలను వినియోగిస్తూ చేపడుతున్న డిజిటల్ భూ రీ సర్వే ప్రక్రియను , సర్వేలో అనుసరిస్తున్న విధానం, భూముల కొలతలు, వివరాల నమోదు తదితర అంశాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఇప్పటివరకు పూర్తయిన సర్వే పనుల పురోగతిపై సమీక్షించి, నిర్దేశిత లక్ష్యాలకు అనుగుణంగా పనులను వేగవంతంగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు.అనంతరం స్థానిక రైతులతో అదనపు కలెక్టర్ నేరుగా మాట్లాడి భూ రీ సర్వేకు సం బంధించి వారి అభిప్రాయాలు, సమస్యలు, సందేహాలను అడిగి తెలుసుకున్నారు. సర్వే సమయంలో భూ యజమానులు తమ భూములకు సంబంధించిన వివరాలను అధికారులకు అందించి సహకరించాలని కోరారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో చేపడుతున్న రీ సర్వే ద్వారా భూముల వివరాలు నమోదు కావడంతో పాటు భవిష్యత్‌లో భూ సంబంధిత సమస్యలను తగ్గించేందుకు అవకాశం ఉంటుందని తెలిపారు. అధికారులు, సర్వే సిబ్బంది, రైతులు పరస్పర సమన్వయంతో పనిచేస్తూ రీ సర్వే ప్రక్రియ విజయవంతంగా పూర్తయ్యేలా సహకరించాలని అదనపు కలెక్టర్ సూచించారు.ఈ పరిశీలనలో కొత్తగూడెం తహసీల్దార్ పుల్లయ్య, కార్పొరేటర్ డాక్టర్ స్వప్న, సర్వేయర్లు, రెవెన్యూ అధికారులు, సిబ్బంది, స్థానిక రైతులు తదితరులు పాల్గొన్నారు.

## దంపింగ్ యార్డ్‌ను తరలించాలి

- సీపీఎం మండల కమిటి
- సర్పంచ్, తహసీల్దార్ కార్యాలయాల్లో వినతిపత్రం అందజేత





**చర్ల, సెప్టెంబర్ 11(ప్రజాజ్యోతి):** చర్ల మేజర్ గ్రామపంచాయతీ పరిధిలోని సాయినగర్, రాజయ్యనగర్, విజయకాలనీ జనావాసాలకు సమీపంలో ఏర్పాటు చేసిన డంపింగ్ యార్డ్‌ను తొలగించే వరకు పోరాటం కొనసాగిస్తామని సీపీఎం మండల కమిటీ నాయకులు తెలిపారు. శుక్రవారం ఆయా కాలనీల ప్రజల సమస్యలపై సీపీఎం ఆధ్వర్యంలో మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ పూజారి సామ్రాజ్యం, ఉపసర్పంచ్ కాపుల కృష్ణార్జునరావులకు వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ప్రజలు ఆయా కాలనీల్లో స్థిర నివాసాలు ఏర్పరచుకున్న అనంతరం జనావాసాలకు సమీపంలో డంపింగ్ యార్డ్ ఏర్పాటు చేయడం వల్ల తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని తెలిపారు. డంపింగ్ యార్డ్ నుంచి వెలువడుతున్న దుర్వాసన, పొగ కారణంగా ఇప్పటికే పలువురు అస్వస్థతకు గురై ఆస్పత్రులను ఆశ్రయించాల్సి వచ్చిందని అన్నారు . డంపింగ్ యార్డ్‌ను అక్కడి నుంచి తొలగించి మరో అనువైన ప్రాంతానికి తరలించాలని డిమాండ్ చేశారు.సమస్యను పరిష్కరించకపోతే ప్రజలను సమీకరించి పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని సీపీఎం నాయకులు హెచ్చరించారు. దీనిపై సర్పంచ్, ఉపసర్పంచ్ సానుకూలంగా స్పందిస్తూ త్వరలోనే పాలకవర్గ సమావేశంలో తీర్మానం చేసి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అయితే హామీలకే పరిమితం కాకుండా డంపింగ్ యార్డ్ సమస్యను పూర్తిగా పరిష్కరించేలా చర్యలు చేపట్టాలని నాయకులు కోరారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్ ముదరాజ్‌కు వినతిపత్రం అందజేసి డంపింగ్ యార్డ్ కారణంగా ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను వివరించారు.ఈ కార్యక్రమాల్లో సీపీఎం మండల కార్యదర్శి మచ్చ రామారావు, వార్డు సభ్యులు పొడుపు కంటి సమ్మక్క, కట్ట స్పందన, మండల కమిటీ సభ్యులు బందెల చంటి, దొడ్డి హరి నాగవర్మ, భీమగోని నవీన్, షారోని, శ్యామల చంద్రం, పామారు లక్ష్మి, కొమరం లక్ష్మి, సునీత, గోపాలం, పొగాకు పుల్లయ్య, మడకం రవి, సూరమ్మ, వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## సెప్టెంబర్ 17న తెలంగాణ విమోచన దినోత్సవాన్ని నిర్వహించాలి

- ప్రతి జిల్లా కేంద్రంలో విమోచన స్ఫూర్తి కేంద్రం ఏర్పాటు చేయాలి



**కొత్తగూడెం కలెక్టరేట్ , సెప్టెంబర్ 11,(ప్రజా జ్యోతి)** సెప్టెంబర్ 17వ తేదీన అధికారికంగా తెలంగాణ విమోచన దినోత్సవాన్ని జరపాలని, సర్దార్ వల్లభాయ్ పటేల్ స్టాచ్యూ ఆఫ్ లిబరేషన్ తెలంగాణాలో ఏర్పాటు చేయాలని, భారతీయ జనతా పార్టీ జిల్లా అధ్యక్షులు బైరెడ్డి ప్రభాకర్ రెడ్డి ప్రభుత్వాన్ని కోరారు, ఈ మేరకు శుక్రవారం బిజెపి జిల్లా అధ్యక్షులు బైరెడ్డి ప్రభాకర్ రెడ్డి ఆధ్వర్యంలో కలెక్టర్ కి వినతి పత్రం అందజేశారు, ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. 1948 సెప్టెంబర్ 17 తెలంగాణ చరిత్రలో మరువలేని మహోన్నతమైన రోజని,నిజాం నిరంకుశ పాలన రజాకార్ల దురగాతాలు జమిందారి జాగిర్దారి దోపిడీ నుంచి హైదరాబాద్ సంస్థానం విముక్తి పొంది భారతదేశంలో విలీనమైన చారిత్రాత్మక రోజన్నారు, అయితే ఈ ఒక్కరోజు ఈ యొక్క వియోచన కోసం అనేకమంది రైతులు మహిళలు యువకులు, సామాన్య ప్రజలు పోరాడి త్యాగాలు చేశారన్నారు. భారతదేశ ఐక్యత కోసం ఉక్కుమనిషి సర్దార్ వల్లభాయ్ పటేల్ చూపిన రాజకీయ సంకల్పం భారత సైన్యం నిర్వహించిన ఆపరేషన్ పోలో చారిత్రాత్మక పరిణామములు కీలక పాత్ర పోషించాయని అన్నారు ,ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి డాక్టర్ జాటోత్ వెంకన్న నాయక్, జిల్లా ఉపాధ్యక్షురాలు చెరుకు భాగ్య లక్ష్మి, జిల్లా కార్యదర్శి దురిశెట్టి కుమార్, ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షులు రాకేష్ బాబు,మహిళా మోర్చా అధ్యక్షులు సముద్రాల గాయత్రి, జిల్లా మహిళా మోర్చా జనరల్ సెక్రెటరీ మువ్వ అపర్ణ, పాల్వంచ టౌన్ అధ్యక్షులు రాపాక రమేష్, చుంచుపల్లి మండల అధ్యక్షులు బలగం శ్రీధర్, ఎస్టీ మోర్చా ఉపాధ్యక్షులు వీర ప్రతాప్, మైనార్టీ మోర్చా రాష్ట కార్యవర్గ సభ్యులు సలీం తదితరులు పాల్గొన్నారు.

## క్రమశిక్షణతో విద్యను అభ్యసించాలి

- సి ఐ తిరుపతి



**గుండాల సెప్టెంబర్ 11 ప్రజా జ్యోతి** విద్యార్థులు క్రమశిక్షణతో విద్యను అభ్యసించాలని గుండాల సీఐ శ్రీపతి తిరుపతి అన్నారు. శుక్రవారం మండలంలోని చిన్న వెంకటాపురం మల్లెలకుంపు పాఠశాలలో కమ్యూనిటీ కాంట్రాక్ట్ ప్రోగ్రాం నిర్వహించారు ఈ సందర్భంగా సీఐ తిరుపతి మాట్లాడుతూ విద్యార్థులు ఉన్నత శిఖరాలను సాధించాలంటే క్రమశిక్షణతో కూడిన విద్యను పట్టుదలతో నేర్చుకోవాలని అన్నారు ఈ సందర్భంగా విద్యార్థులకు బ్యాగులు, గొడుగులు పంపిణీ చేశారు అనంతరం గ్రామస్తులను సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గ్రామస్తులకు తగు సూచనలు సలహాలు ఇచ్చారు ఈ కార్యక్రమంలో ఎస్సై శ్రావణ్ కుమార్ పోలీస్ శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## సర్టిఫికెట్ల కోసం వచ్చే ప్రజలు ఇబ్బంది పడవద్దు

- ఆర్ఐ -2ను పర్మినెంట్ గా ఏర్పాటు చేయాలి



**ఇల్లందు, సెప్టెంబర్ 11 (ప్రజా జ్యోతి)** సర్టిఫికెట్ల కోసం వచ్చే ప్రజలు ఇబ్బంది పడవద్దని, ఆర్ఐ –2ను పర్మినెంట్ గా ఏర్పాటు చేయాలని టీడీపీ ఇల్లందు నియోజకవర్గ కోఆర్డినేటర్ ముద్రగడ వంశీ, విజయలక్ష్మి నగర్ పంచాయతీ సర్పంచ్ చాందావత్ రమేష్ బాబు లు కోరారు. శుక్రవారం ఇల్లందు తహసీల్దార్ కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇల్లందు మండల, టౌన్ ఆర్ఐ ఒకరే అవడంతో సర్టిఫికెట్ జారీ లో జాప్యం జరుగుతుందన్నారు. వీలైనంత త్వరగా సర్టిఫికెట్లు జారీ చేయాలని కొంతమంది సర్టిఫికెట్ల కోసం ఇబ్బంది పడుతూ తమ దృష్టికి రావడంతో మాట్లాడి సర్టిఫికెట్ జారీ లో జాప్యం లేకుండా చూడాలని కోరారు. విద్యార్థుల విషయం లో ఎలాంటి ఇబ్బందులు లేకుండా సర్టిఫికెట్లు జారీ చేయాలని పేర్కొన్నారు. అనంతరం తహసీల్దార్ స్పందించి తాను తహసీల్దార్ గా వచ్చినప్పటి నుంచి సర్టిఫికేట్ల మంజూరులో ఎలాంటి జాప్యం కావడం లేదని స్పష్టం చేశారు. ఎవరైనా సర్టిఫికెట్ల విషయంలో ఇబ్బందులు పడితే నేరుగా తనను సంప్రదించాలని సూచించారు. అదేవిదంగా మరొక ఆర్ఐ ని నియమించేలా ఉన్నతాదికారులతో మాట్లాడుతున్నానని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో టిఎన్ఎస్ఎఫ్, టిడిపి పట్టణ ఉపాధ్యక్షులు దాసరి గోపాలకృష్ణ, గోగ్గల రాజేష్, ముక్కు శ్రీవేద్, పొదిలా శ్యామ్, బాసాని నవీన్, భాస్కర్, బెజ్జంకి శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

## గణేష్ మండపాల వద్ద భద్రతా నిబంధనలు పాటించాలి

- ఎస్ఐ మేడ ప్రసాద్

**బూర్గంపహాడ్, సెప్టెంబరు 11 (ప్రజా జ్యోతి):** రాబోయే గణేష్ నవరాత్రి ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా నిర్వహించేందుకు మండపాల నిర్వాహకులు, మండలంలోని సర్పంచులతో బూర్గంపహాడ్ ఎస్ఐ మేడ ప్రసాద్ శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గణేష్ మండపాల ఏర్పాటు, నవరాత్రి ఉత్సవాలు, ఊరేగింపులు తదితర అంశాలపై పోలీసుల సూచనలు, భద్రతా నిబంధనలను వివరించారు.గణేష్ మండపాల నిర్వాహకులు ముందుగానే తెలంగాణ పోలీస్ పోర్టల్‌లో మండపానికి సంబంధించిన పూర్తి వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేసుకుని, అవసరమైన అనుమతులు తప్పనిసరిగా పొందాలని ఎస్ఐ సూచించారు.మండపాల ఏర్పాటుకు విద్యుత్ శాఖ నుంచి అనుమతి తీసుకోవాలని, విద్యుత్ వైరింగ్ విషయంలో జాగ్రత్తలు పాటించాలని తెలిపారు.మండపాలను ఏర్పాటు చేసే సమయంలో ట్రాఫిక్‌కు ఎలాంటి అంతరాయం కలగకుండా స్థలాన్ని ఎంపిక చేసుకోవాలని సూచించారు. గణేష్ మండపాల వద్ద, అలాగే విగ్రహాల ఊరేగింపుల సమయంలో డీజేలు వినియోగించరాదని స్పష్టం చేశారు. రాత్రి 10 గంటల తర్వాత ఎట్టి పరిస్థితుల్లోనూ లౌడ్‌స్పీకర్లు, డీజేలు వినియోగించకూడదని తెలిపారు.ఉత్సవాల సందర్భంగా ఇతరులకు ఇబ్బంది కలగకుండా నిర్వాహకులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, పోలీసులకు పూర్తిస్థాయిలో సహకరించాలని ఎస్ఐ కోరారు. ప్రతి గణేష్ మండపం వద్ద కనీసం ముగ్గురు వాలంటీర్లు 24 గంటల పాటు అందుబాటులో ఉండేలా నిర్వాహకులు చర్యలు తీసుకోవాలని సూచించారు.అలాగే భద్రతా చర్యల్లో భాగంగా ప్రతి మండపం వద్ద సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని తెలిపారు. అగ్నిప్రమాదాల నివారణకు ముందస్తు జాగ్రత్తగా మండపాల వద్ద ఇసుక బకెట్లు, నీటి వసతి లేదా ఫైర్ ఎక్స్టింగ్యూషర్లు తప్పనిసరిగా అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు.ఇతరుల మనోభావాలను దెబ్బతీసేలా, రెచ్చగొట్టే విధంగా ఉండే పాటలు, నినాదాలను పూర్తిగా నిషేధించినట్లు ఎస్ఐ మేడ ప్రసాద్ స్పష్టం చేశారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించే చర్యలకు పాల్పడకుండా ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో, సోదరభావంతో నిర్వహించాలని కోరారు.ఎలాంటి అత్యవసర పరిస్థితులు ఎదురైనా ప్రజలు వెంటనే 112కు సమాచారం అందించాలని ఎస్ఐ సూచించారు. గణేష్ నవరాత్రి ఉత్సవాలు ప్రశాంతంగా జరిగేలా ప్రతి ఒక్కరూ పోలీసులకు సహకరించాలని ఆయన కోరారు.



## వ్యవసాయ కార్మికులను ఆదుకోవాలి

- సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలి
- వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రేపాకుల శ్రీనివాస్



**చర్ల, సెప్టెంబర్ 11:(ప్రజాజ్యోతి):** కరువు పరిస్థితులు నెలకొంటున్న నేపథ్యంలో వ్యవసాయ కార్మికులను ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకోవాలని వ్యవసాయ కార్మిక సంఘం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రధాన కార్యదర్శి రేపాకుల శ్రీనివాస్ డిమాండ్ చేశారు. శుక్రవారం వ్యవసాయ కార్మిక సంఘం మండల అధ్యక్షుడు దొడ్డి హరినాగవర్మ అధ్యక్షతన నిర్వహించిన అత్యవసర సమావేశంలో ఆయన మాట్లాడారు.కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వ్యవసాయ కార్మికుల సమస్యలను నిర్లక్ష్యం చేస్తున్నాయని ఆయన విమర్శించారు. వ్యవసాయ కార్మికులు లేకుండా రైతాంగం వ్యవసాయం కొనసాగించడం కష్టమని, యాంత్రీకరణ పెరిగినప్పటికీ కూలీల అవసరం తప్పదని అన్నారు .మండలంలోని రైతులు వ్యవసాయ కార్మికులకు సమాన పనికి సమాన వేతనం అందించాలని కోరారు. పెరుగుతున్న నిత్యావసర వస్తువులు, కూరగాయల ధరలకు అనుగుణంగా కూలీ రేట్లు పెంచి వ్యవసాయ కార్మికులకు అండగా నిలవాలని విజ్ఞప్తి చేశారు. ఉచితంగా బియ్యం అందిస్తున్నప్పటికీ ఇతర నిత్యావసరాల ధరలు పెరుగుతున్నందున వ్యవసాయ కూలీలకు కూడా తగిన విధంగా కూలీ రేట్లు పెంచాల్సిన అవసరం ఉందన్నారు.ఈ సమావేశంలో వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి బందెల చంటి, మహిళా కన్వీనర్ ఊడుగుల షారోని, శ్యామల చంద్రం, పర్శిక సూరిబాబు, కొర్సా శ్రీనివాస్, శ్యామల వెంకటలక్ష్మి, బుటారి నాగరత్నం తదితరులు పాల్గొన్నారు.

## టూరిజం హబ్‌లో తాలిపేరుకు చోటివ్వాలి

- ఆదివాసీ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలి
- గొండ్వాన సంక్షేమ పరిషత్ జిల్లా అధ్యక్షుడు బీరబోయిన శేఖర్



**చర్ల, సెప్టెంబర్ 11(ప్రజాజ్యోతి):** రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేయబోయే టూరిజం హబ్‌లో ప్రకృతి అందాలకు నిలయమైన తాలిపేరు ప్రాజెక్టును చేర్చి ప ర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేయాలని గొండ్వాన సంక్షేమ పరిషత్ జిల్లా అ ధ్యక్షుడు బీరబోయిన శేఖర్ కోరారు. శుక్రవారం చర్ల మండల కేంద్రంలో మం డల అధ్యక్షుడు ఇర్ప అంజిబాబు అధ్యక్షతన గొండ్వాన సంక్షేమ పరిషత్ ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా బీరబోయిన శేఖర్ మాట్లాడుతూ హైదరాబాద్ నుంచి వాజేడు మండలంలోని బొగత జలపాతం వరకు ఏర్పాటు చేయబోయే టూరిజం హబ్‌లో కిన్నెరసాని, బొగత జలపాతం, పులిగుండాల వంటి పర్యాటక ప్రాంతాలతో పాటు తాలిపేరు ప్రాజెక్టును కూ డా చేర్చాలని అన్నారు. తాలిపేరు ప్రాజెక్టును విస్మరించడం ఏజెన్సీ ప్రాంత ప ర్యాటక అభివృద్ధిని వెనుకకు నెట్టడమేనని అన్నారు .ఛత్తీస్‌గఢ్ అడవుల నుంచి తెలంగాణలోకి ప్రవహించే తాలిపేరు ప్రాజెక్టు మూడు రాష్ట్రాల సరిహద్దులకు సమీపంలో ఉండటంతో పర్యాటకంగా అభివృద్ధి చేస్తే ఛత్తీస్‌గఢ్, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల నుంచి పెద్ద సంఖ్యలో పర్యాటకులు వచ్చే అవకాశం ఉం దన్నారు. తాలిపేరు ప్రాజెక్టు వద్ద బోటింగ్ సౌకర్యంతో పాటు ట్రైబల్ మ్యూజి యం ఏర్పాటు చేయాలని కోరారు. దీంతో ప్రభుత్వానికి ఆదాయం సమకూరడంతో పాటు స్థానిక ఆదివాసీ నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు లభిస్తాయని తెలిపారు. తాలిపేరు పరిసర ప్రాంతాల్లో దట్టమైన అడవులు ఉండటంతో అనేక రకాల వనమూలికలు లభిస్తాయని, ప్రభుత్వ భూముల్లో వనమూలికల ప్లాంటేషన్లు ఏర్పాటు చేయాలని సూచించారు. దీని ద్వారా ఆయుర్వేద విద్యను అభ్యసించే విద్యార్థులకు ఈ ప్రాంతం అధ్యయన, సందర్శన కేంద్రంగా అభివృద్ధి చెందే అవకాశం ఉందన్నారు.ఐటీడీఏ పీఓ, జిల్లా కలెక్టర్ ప్రత్యేక చొరవ తీసుకుని ప్రభుత్వం ఏర్పాటు చేయబోయే టూరిజం హబ్‌లో తాలిపేరు ప్రాజెక్టు పేరును చేర్చేలా చర్యలు తీసుకోవాలని గొండ్వాన సంక్షేమ పరిషత్ నాయకులు కోరారు. ఈ సమావేశంలో మండల ప్రధాన కార్యదర్శి శ్రీనివాస రావు, కారం పద్మ, తెల్లం సునీత, తులసి తదితరులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్సీ తాతా మధును బర్తరఫ్ చేయాలి

- టీపీసీసీ అధికార ప్రతినిధి మద్ది శ్రీనివాస్‌రెడ్డి డిమాండ్



**కొత్తగూడెం, సెప్టెంబర్ 11, ప్రజా జ్యోతి :** ఖమ్మం స్థానిక సంస్థల ఎమ్మెల్సీ తాతా మధును తక్షణమే పదవి నుంచి బర్తరఫ్ చేయాలని తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ రాష్ట్ర అధికార ప్రతినిధి మద్ది శ్రీనివాస్‌రెడ్డి డిమాండ్ చేశారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షురాలు తోట దేవీప్రసన్న అధ్యక్షతన శుక్రవారం కొత్తగూడెంలోని రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీఆర్ఎస్, బీజేపీపై తీవ్రస్థాయిలో విమర్శలు చేశారు. ఇటీవల బీఆర్ఎస్ నాయకులు నిర్వహించిన పసుపు నీళ్ల శుద్ధీకరణ కార్యక్రమాన్ని మద్ది శ్రీనివాస్ రెడ్డి తీవ్రంగా ఖండించారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో ఇలాం టి చర్యలు అత్యంత పాశవికమైనవని, సమాజానికి తప్పుడు సంకేతాలు పం పే విధంగా ఉన్నాయని మండిపడ్డారు. ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్న నాయకులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

**అధికారం కోల్పోగానే బాధ్యతారాహిత్య వైఖరి...**

అధికారం కోల్పోయిన తర్వాత బీఆర్ఎస్ నాయకులు బాధ్యతారహితంగా వ్యవహరిస్తున్నారని శ్రీనివాస్‌రెడ్డి విమర్శించారు. ప్రజలు ప్రతిపక్ష హోదా కల్పించినప్పటికీ మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ అసెంబ్లీ సమావేశాలకు సైతం హాజరుకాకుండా ప్రజా సమస్యలను గాలికొదిలేశారని ఆరోపించారు. బీఆర్ఎస్ పార్టీ ఒక కుటుంబానికి చెందిన కొద్దిమంది ప్రయోజనాల కోసమే పనిచేస్తోందని విమర్శించారు. ప్రజల సమస్యల కంటే ప్రాంతీయ, కుటుంబ రాజకీయాలకే ఆ పార్టీ ప్రాధాన్యం ఇస్తోందని అన్నారు. అదే విధంగా బీజేపీపై కూడా ఆయన విమర్శలు గుప్పించారు. బీజేపీ మతతత్వ రాజకీయాలను ఆధారంగా చేసుకుని రాజకీయ ప్రయోజనాలు పొందేందుకు ప్రయత్నిస్తోందని ఆరోపించారు. బీఆర్ఎస్, బీజేపీ విధానాలను ప్రజలు గమనిస్తున్నారని, రానున్న రోజుల్లో ఈ రెండు పార్టీలకు ప్రజలే తగిన సమాధానం చెబుతారని అన్నారు.

**ఇచ్చిన హామీలను అమలు చేస్తున్న కాంగ్రెస్**

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తోందని మద్ది శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. రైతులకు రుణమాఫీ ప్రక్రియను ప్రభుత్వం కొనసాగిస్తోందని, ఉచిత విద్యుత్, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం తదితర సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తోందని వివరించారు. ప్రజా సంక్షేమమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తోందని పేర్కొన్నారు. భవిష్యత్తులోనూ తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ తిరిగి అధికారంలోకి రావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షురాలు తోట దేవీప్రసన్న, రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు కొనేరు సత్యనారాయణ, అల్లి మురళి, సొసైటీ చైర్మన్ మండే వీర హనుమంతురావు, డీసీఎంఎస్ మాజీ చైర్మన్ కాత్యాల శ్రీనివాసరావు, డిప్యూటీ మేయర్ మిరియాలపర్తి లలితాకుమారి, యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు ఇరవట కార్తీక్, సోషల్ మీడియా కన్వీనర్ కనుబుద్ధి దేవా, జిల్లా అధికార ప్రతినిధి వై. శ్రీనివాసరెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శులు ఎం. పెదబాబు, తానేటి నాగార్జున, జిల్లా కార్యదర్శి నూకల రంగారావు, సుజాతనగర్ మండల అధ్యక్షుడు నల్లా అజయ్‌కుమార్, పాల్వంచ మండల అధ్యక్షుడు భువనసుందర్‌రెడ్డి, కొత్తగూడెం పట్టణ అధ్యక్షుడు ప్రమేశ్ యాదవ్, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు చింతలపల్లి డి. విష్ణుశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

- ఆరోగ్య శిబిరాలు, ఫ్రైడే డ్రై డే అవగాహన కార్యక్రమాలు






**చర్ల, సెప్టెంబర్ 11:(ప్రజా జ్యోతి):** చర్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ హారిక ఆదేశాలమేరకు పీహెచ్‌సీ పరిధిలోని వివిధ సబ్ సెంటర్ ప్రాంతాల్లో ఆరోగ్య శిబిరాలు, ఫ్రైడే డ్రై డే అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఏకలవ్య పాఠశాలతో పాటు ఉంజుపల్లి, రైస్‌పేట, రేగుంట, లక్ష్మీ కాలనీ, గోంపల్లి గ్రామాల్లో ఆరోగ్య శిబిరాలు నిర్వహించి మొత్తం 233 మందికి వైద్య సేవలు అందించారు.ఈ సందర్భంగా ఆరోగ్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు వర్షాన్ని సైతం లెక్కచేయకుండా ప్రజలకు ఆరోగ్యం, పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. నీరు నిల్వ ఉండే ప్రదేశాల్లో దోమలు వృద్ధి చెంది మలేరియా, డెంగ్యూ వంటి వ్యాధులు వ్యాప్తి చెందే అవకాశం ఉందని వివరించారు.పాత టైర్లు, ఖాళీ సీసాలు, పగిలిన కుండలు, కొబ్బరి చిప్పలు, ప్లాస్టిక్ డబ్బాలు తదితర వాటిలో నీరు నిల్వ ఉండకుండా ఎప్పటికప్పుడు ఖాళీ చేసి శుభ్రం చేయాలని సూచించారు. వారానికి ఒకరోజు మాత్రమే కాకుండా ప్రతిరోజూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడం ద్వారా దోమల వృద్ధిని అరికట్టవచ్చని తెలిపారు. "ప్రతి శుక్రవారం ఫ్రైడే డ్రై డే పాటిద్దాం దోమల వృద్ధిని అరికట్టి ఆరోగ్యాన్ని కాపాడుకుందాం" అని ఆరోగ్య సిబ్బంది ప్రజలకు అవగాహన కల్పించారు.

## పెద్దరెడ్డిగూడెంలో టీబీ ముక్త భారత్ అభియాన్ వైద్య శిబిరం


- 56 మందికి ఛాతీ ఎక్స్‌రే పరీక్షలు.. 7 మంది టీబీ అనుమానితుల గుర్తింపు



**అన్నపురెడ్డిపల్లి, సెప్టెంబర్ 11, (ప్రజా జ్యోతి):** దేశాన్ని క్షయరహితంగా తీర్చిదిద్దే లక్ష్యంతో ప్రభుత్వం చేపట్టిన 'టీబీ ముక్త భారత్ అభియాన్' కార్యక్రమంలో భాగంగా పెద్దరెడ్డిగూడెం గ్రామ పంచాయతీ భవనంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. గ్రామ ఉప సర్పంచ్ వేముల నరేష్ ముఖ్య అతిథిగా హాజరై శిబిరాన్ని ప్రారంభించారు. ఎర్రగుంట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో మొబైల్ ఎక్స్‌రే పరికరం ద్వారా గ్రామస్తులకు ఉచితంగా ఛాతీ ఎక్స్‌రే పరీక్షలు నిర్వహించారు. మొత్తం 56 మందికి పరీక్షలు చేయగా, 7 మంది టీబీ అనుమానితులను గుర్తించారు. ఈ సందర్భంగా కమ్యూనిటీ ఆరోగ్య అధికారి వాణి మాట్లాడుతూ.. రెండు వారాలకు మించి తగ్గని దగ్గు, జ్వరం, ఆకలి మందగించడం, బరువు తగ్గడం, రాత్రిపూట చెమటలు పట్టడం వంటి లక్షణాలు ఉన్నవారు వెంటనే పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. అనుమానితులకు కళ్లె పరీక్షలు నిర్వహించి, వ్యాధి నిర్ధారణ అయితే ఉచితంగా చికిత్స, మందులు అందిస్తామని తెలిపారు. టీబీ రోగులకు పౌష్టికాహార సహాయం కోసం 'నిక్షయ్ పోషణ్ యోజన' ద్వారా ప్రభుత్వం ఆర్థిక సాయం అందిస్తుందని వివరించారు. ప్రభుత్వం అందిస్తున్న ఉచిత వైద్య సేవలను గ్రామస్తులు సద్వినియోగం చేసుకోవాలని ఉప సర్పంచ్ వేముల నరేష్ కోరారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్యాధికారి వాణి, ఆరోగ్య విద్యాధికారి జయలక్ష్మి, టీబీ పర్యవేక్షకుడు వెంకట్, ఎక్స్‌రే సాంకేతిక నిపుణుడు సాయికృష్ణ, ఆరోగ్య సహాయకుడు రామదాసు, ఆశా కార్యకర్తలు వెంకటలక్ష్మి, లక్ష్మి, విజయలక్ష్మి, గ్రామస్తులు పాల్గొన్నారు.

# సర్కార్ బడికి డుమ్మా..! ఇన్సూరెన్స్ కంపెనీకి జీ హుజూర్

- చాక్ పీస్ వదిలి పాలసీ బాండ్ పట్టిన కొందరు టీచర్లు
- జీతం సర్కార్ ది..సేవ ప్రైవేట్ ది..పిల్లల భవిష్యత్తు అంధకారంలో..!
- గురువుగారండీ.. పాలసీ తీసుకుంటారా.? అంటు సర్కార్ స్కూళ్లలో ఇన్సూరెన్స్ దందా
- టాటా ఏఐఏ, హెచ్డీ ఎఫ్సీ ఈర్గో,ఎస్బీఐ లైఫ్, ఎల్ ఐసీ ఏజెంట్లుగా కొందరు ప్రభుత్వ టీచర్లు..! విద్యాశాఖలో పెద్ద కుంభకోణం
- జిల్లా కలెక్టర్ జోక్యం చేసుకోవాలని డిమాండ్




భద్రాద్రి కొత్తగూడెం జిల్లా క్రైమ్ ప్రతినిధి. సెప్టెంబర్ 11, ప్రజాజ్యోతి భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ప్రభుత్వ విద్యా వ్యవస్థను కొందరు ప్రభుత్వ టీచర్లు భ్రష్టు పట్టిస్తున్నారు. చదువు చెప్పాల్సిన పవిత్రమైన వృత్తిని పక్కన పెట్టి కమిషన్లకు కక్కుర్తి పడి ప్రైవేట్ ఇన్సూరెన్స్ కంపెనీలకు ఏజెంట్లుగా మారిపోయారు. మొదట్లో ఒక్క టాటా ఏఐఏ, కంపెనీతో మొదలైన ఈ దందా ఇప్పుడు హెచ్డీఎఫ్సీ ఈర్గో,ఎస్బీఐ లైఫ్, ఎల్ఐసీ వరకు పాకింది. జిల్లా వ్యాప్తంగా దాదాపు ప్రతి మండలంలోనూ ఇదే పరిస్థితి ఉందనే ఆరోపణలు గుప్పుమంటున్నాయి.మరి వీరి తీరు చూస్తే షాక్ అవ్వాల్సిందే. ఉదయం స్కూల్ అటెండెన్స్ రిజిస్టర్ లో సంతకం పెట్టి తర్వాత స్కూల్ కు డుమ్మా కొట్టి ఇన్సూరెన్స్ కంపెనీలు నిర్వహించే మీటింగ్ లకు, ట్రైనింగ్ లకు వెళ్తున్నారు. కొందరైతే ఏకంగా వారం రోజుల తరబడి స్కూల్ మొహమే చూడకుండా పాలసీల వేటలో తిరుగుతున్నారు. ఇంకొందరు స్కూల్ టైంలోనే క్లాస్ రూంలో కూర్చొని ఫోన్లలో కస్టమర్లతో పాలసీల గురించి మాట్లాడుతూ బేరాలు చేస్తున్నారు. దీంతో పిల్లలకు పాఠాలు చెప్పే దిక్కు లేకుండా పోవడంతో ప్రభుత్వ స్కూళ్లు పూర్తిగా మరుగున పడే పరిస్థితి నెలకొంది.

### అమాయక తల్లిదండ్రులే టార్గెట్

అమాయక తల్లిదండ్రులే వీరికి టార్గెట్ మారారు. పిల్లల ప్రోగ్రెస్ గురించి తెలుసుకుందామని స్కూల్ కు వచ్చే తల్లిదండ్రులకు చదువు గురించి చెప్పకుండా.."మీ పిల్లల భవిష్యత్తు కోసం ఒక మంచి పాలసీ ఉంది, ఫ్యూచర్ సెక్యూర్ అవుతుంది" అంటూ బ్రెయిన్ వాష్ చేస్తున్నారు. స్కూల్ ఆవరణలోనే, స్కూల్ రికార్డుల్లో ఉన్న తల్లిదండ్రుల ఫోన్ నంబర్లతో వారికి ఫోన్ చేసి మరీ పాలసీలు అంటగడుతున్నారు. తీసుకోకపోతే పిల్లల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తారనే భయంతో చాలా మంది అప్పులు చేసి మరీ పాలసీలు తీసుకుంటున్నారని తెలుస్తోంది.

### ప్రభుత్వ ఉద్యోగి ప్రైవేట్ వ్యాపారం, కమిషన్ వ్యాపారం చేయొద్దు

ప్రభుత్వ నిబంధనల ప్రకారం ప్రభుత్వ ఉద్యోగి ఎలాంటి ప్రైవేట్ వ్యాపారం, కమిషన్ వ్యాపారం చేయకూడదు. అలా చేస్తే అది సర్వీస్ రూల్స్ కు విరుద్ధం, క్రమశిక్షణా చర్యలకు దారి తీస్తుంది. అయిన జిల్లాలో విద్యాశాఖ అధికారులు మాత్రం తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. క్షేత్రస్థాయిలో పర్యటించి టీచర్ల హాజరును పరిశీలించాల్సిన ఎమ్ఈఓలు,డీఈఓలు కూడా చూసీచూడనట్లు వదిలేస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. ఈ అలసత్వమే టీచర్లను మరింత రెచ్చగొడుతోందని స్పష్టంగా కనపడుతోంది.

### జీతం సర్కార్ ది.. సేవ ప్రైవేట్ ది.. పిల్లల భవిష్యత్తు అంధకారంలో..!

జిల్లాలో విద్యా ప్రమాణాలు రోజురోజుకూ పడిపోవడానికి ఇది కూడా ఒక ప్రధాన కారణమని విద్యావేత్తలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సర్కార్ జీతం నెలకు రూ.70 వేల నుంచి లక్ష వరకు తీసుకుంటూ.. ప్రైవేట్ కంపెనీ ల నుంచి నెలకు రూ.30 వేల నుంచి రూ.50వేల వరకు కమిషన్ రూపంలో రెండు చేతులా సంపాదిస్తున్నారని, కానీ పిల్లలకు మాత్రం అన్యాయం చేస్తున్నారని తల్లిదండ్రులు మండిపడుతున్నారు.

### జిల్లా కలెక్టర్ అంకిత్ దృష్టి సారించాలి

జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ టీచర్లందరి ఇన్సూరెన్స్ ఏజెన్సీ కోడ్ లను ఆరా తీయాలని,స్కూళ్లకు వెళ్లకుండా ఇన్సూరెన్స్ దందా చేస్తున్న టీచర్లను గుర్తించి వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఈ దందాపై జిల్లా కలెక్టర్ అంకిత్ సీరియస్ గా దృష్టి సారించాలని పలువురు విద్య వేత్తలు కోరుతున్నారు. అలాంటి టీచర్లను వెంటనే గుర్తించి సస్పెండ్ చేసి వారి లైసెన్స్ లు రద్దు చేయాలని తల్లిదండ్రులు, విద్యార్థి సంఘాల నాయకులు డిమాండ్ చేస్తున్నారు. లేకపోతే ప్రభుత్వ బడుల్లో చదువులు పూర్తిగా బంద్ అయ్యే ప్రమాదం ఉందని చెప్తున్నారు.

## పెండ్లి వాగు పై ప్రాజెక్టు నిర్మించాలి

- నీటిపారుదల ఎస్ ఈ కి వినతి పత్రం అందజేసిన న్యూ డెమోక్రసీ



గుండాల సెప్టెంబర్ 11 ప్రజా జ్యోతి లింగగూడెం సమీపంలోని పెండ్లి వాగు పై ప్రాజెక్టు నిర్మించాలని కోరుతూ నీటిపారుదల ఎస్ ఈ కె మహేశ్వర రావు కు న్యూ డెమోక్రసీ ఆధ్వర్యంలో వినతి పత్రం అందజేశారు. శుక్రవారం మండల పర్యటనకు వచ్చిన ఎస్ ఈ కి వినతి పత్రం అందజేసిన అనంతరం సర్పంచ్ కోరం సీతారాములు మాట్లాడుతూ గుండాల మండలంలో సరైన ప్రాజెక్టు లేని కారణంగా భూగర్భ జలాలు సరిగా లేవని, వర్షాధారం మీదనే రైతులు ఆధార పడాల్సి వస్తుందని ఇలాంటి ప్రాజెక్టులు నిర్మిస్తే ప్రజలకు నీటి కష్టాలు తీరుతాయి అన్నారు. విస్తారమైన భూములు ఉన్నప్పటికీ నీటి సౌకర్యం లేని కారణంగా వర్షాధారం మీదనే ఆధారపడి పంటలు పండించుకోవాల్సిన పరిస్థితి నెలకొందని పెండ్లి వాగు ప్రాజెక్ట్ నిర్మిస్తే 12 వేల ఎకరాలకు మీరు అందుతుందని అన్నారు. పెళ్లి వాగు పై ప్రాజెక్టు నిర్మిస్తే గుండాల మండలమే గాక పక్కనే ఉన్న గంగారం తాడువాయి మండలాల రైతులకు ఉపయోగకరంగా ఉంటుందన్నారు. ఏకేఎంఎస్ మండల అధ్యక్షులు గడ్డం లాలయ్య న్యూ డెమోక్రసీ నాయకులు యాసారపు వెంకన్న, లాలు, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

## కరెంట్ ఇవ్వడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలం...బి ఆర్ ఎస్



గుండాల సెప్టెంబర్ 11 ప్రజా జ్యోతి రైతులకు నాణ్యమైన విద్యుత్ అందివ్వడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని బి ఆర్ ఎస్ మండల అధ్యక్షులు తెల్లం భాస్కర్ పార్టీ నాయకులు మోకాళ్ళ వీరస్వామి, గడ్డం వీరన్న లు అన్నారు. శుక్రవారం పార్టీ ఆధ్వర్యంలో సబ్ స్టేషన్ ముందు ధర్నా నిర్వహించారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులకు 24 గంటల కరెంటు ఇవ్వడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఆరోపించారు. వర్షాలు లేని కారణంగా రైతులు బోర్ల ద్వారా మీరు అందించాలంటే కరెంటు లేక నానా ఇబ్బందులు పడుతున్నారని 24 గంటలు కరెంటును అందివాలన్నారు. అధికారంలోకి రాకముందు అనేక వాగ్దానాలు చేసి రైతులను నట్టేట ముంచిందన్నారు. కరెంటు తో పాటు రైతులకు ఎరువుల అందించడంలోనూ కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందన్నారు. ఈ కార్యక్రమంలో టి రాము, ఉపసర్పంచ్ తాటి ప్రభాకర్, ఈసం సాగర్, నిట్ట రాములు, పొంబోయిన సుధాకర్, గుగ్గిల రాంబాబు, గంగాధరి ప్రమోద్, మహేందర్ రవి తదితరులు పాల్గొన్నారు

## ఉస్మానియా విశ్వవిద్యాలయం నుంచి హిమావతికి డాక్టరేట్



కొత్తగూడెం, సెప్టెంబర్ 11, ప్రజాజ్యోతి : ఉన్నత విద్యలో ప్రతిభ కనబరుస్తూ ఎస్. హిమావతి ఉస్మానియా విశ్వవిద్యాలయం నుంచి డాక్టరేట్ పట్టా సాధించారు. విశ్వవిద్యాలయంలోని రసాయన శాస్త్ర విభాగంలో 'అణు అనుసంధాన అధ్యయనాలు, టెట్రాజోల్ ఉత్పన్నాలు' అనే అంశంపై ఆమె విస్తృతంగా పరిశోధన నిర్వహించారు. పరిశోధనకు సంబంధించిన అంశాలను సమగ్రంగా అధ్యయనం చేసి, పరిశోధనా గ్రంథాన్ని విశ్వవిద్యాలయానికి సమర్పించిన అనంతరం హిమావతికి డాక్టరేట్ పట్టా లభించింది. విద్యాభ్యాసంలో పట్టుదలతో ముందుకు సాగిన హిమావతి తన పరిశోధనను విజయవంతంగా పూర్తి చేసి డాక్టరేట్ సాధించడం పట్ల కుటుంబ సభ్యులు, బంధువులు, స్నేహితులు, శ్రేయోభిలాషులు హర్షం వ్యక్తం చేశారు. ఉన్నత విద్యలో ఆమె సాధించిన ఈ విజయాన్ని అభినందిస్తూ పలువురు శుభాకాంక్షలు తెలిపారు. పరిశోధనా రంగం లో మరింతగా రాణిస్తూ, భవిష్యత్తులో విద్యా రంగానికి తనవంతు సేవలు అందించాలని ఆకాంక్షించారు. హిమావతి తల్లిదండ్రులు ఎస్. కోమరయ్య, ఎస్. శంకరమ్మ.

## సాయుధ రైతాంగ పోరాటం అజరామరం

- అమరుల ఆశయాల సాధనకు సమరశీల ఉద్యమాలు నిర్మించాలి: సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్.కె. సాబీర్‌పాషా



సుజాతనగర్, సెప్టెంబర్ 11 ప్రజా జ్యోతి : తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట చరిత్ర అజరామరమని, నాటి వీరోచిత పోరాటాల స్ఫూర్తితో నేటి నయా రాచరిక పాలకులపై ఉద్యమించాల్సిన అవసరం ఉందని సీపీఐ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కార్యదర్శి ఎస్.కె. సాబీర్‌పాషా పిలుపునిచ్చారు. చారిత్రక తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట వారోత్సవాల ప్రారంభ సభ శుక్రవారం సుజాతనగర్ మండలం నాయకులగూడెం గ్రామంలో జరిగింది. పోరాటానికి పిలుపునిచ్చిన నేత రావి నారాయణరెడ్డి స్థూపం వద్ద సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ముత్యాల విశ్వనాథం ఎర్రజెండాను ఆవిష్కరించిన అనంతరం జరిగిన సభలో సాబీర్‌పాషా ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. నిజాం నవాబు నిరంకుశ పాలన, దేశ్‌ముఖ్‌ల భూస్వామ్య దోపిడీకి వ్యతిరేకంగా సాగిన మహత్తర సాయుధ రైతాంగ పోరాటం ప్రపంచానికే ఆదర్శంగా నిలిచిందన్నారు. వెట్టిచాకిరీ నుంచి విముక్తి, భుక్తి, 'దున్నేవాడికే భూమి' హక్కు కోసం వేలాది మంది కమ్యూనిస్టు యోధులు ప్రాణత్యాగాలు చేసి పేదలకు భూములు పంచిపెట్టారని గుర్తుచేశారు. కమ్యూనిస్టుల రక్తతర్పణంతో నిర్మితమైన ఈ పోరాట చరిత్రలో బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్‌ల పాత్ర ఇసుమంత కూడా లేదని స్పష్టం చేశారు. నాడు ఎలాంటి త్యాగం చేయని మితవాద శక్తులు నేడు సాయుధ పోరాట చరిత్రను తమ రాజకీయ ప్రయోజనాల కోసం వక్రీకరించే ప్రయత్నం చేయడం సిగ్గుచేటన్నారు. వర్గ పోరాటాన్ని హిందూ—ముస్లిం ఘర్షణగా చిత్రీకరిస్తూ చరిత్రను వక్రీకరించడాన్ని సహించేది లేదని హెచ్చరించారు. అమరుల ఆశయాలు నేటికీ పూర్తిస్థాయిలో నెరవేరలేదని, ప్రజా సమస్యల పరిష్కారం, ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం సమరశీల ఉద్యమాలను నిర్మించాలని పిలుపునిచ్చారు. అనంతరం నాయకులగూడెంలోని సాయుధ పోరాట యోధుడు కొమారి రామయ్య విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కొమారి హన్మంతరావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ముత్యాల విశ్వనాథం, మేయర్ మూడ్ గణేష్, రాష్ట్ర సమితి సభ్యులు సలిగంటి శ్రీనివాస్, జిల్లా కార్యవర్గ సభ్యులు వి.పూర్ణచందర్‌రావు, కంచర్ల జమలయ్య, వాసిరెడ్డి మురళి, జి.వీరాస్వామి, కందుల భాస్కర్, భూక్య దస్రు, జిల్లా సమితి సభ్యులు జక్కుల రాములు, భూక్య శ్రీనివాస్, కె.రత్నకుమారి, వర్క అజిత్, పలువురు పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## భద్రాచలంలో గోల్డ్ షాపులపై దాడులు

కొత్తగూడెం కలెక్టరేట్, భద్రాచలం / సెప్టెంబరు 11,(ప్రజా జ్యోతి) భద్రాచలం పట్టణంలోని పలు బంగారం దుకాణాల్లో బి ఐ ఎస్ అధికారులు శుక్రవారం ఆకస్మిక తనిఖీలు చేపట్టారు, అనుమతులు లేకుండా నకిలీ హోల్ మార్కుతో విక్రయాలు సాగిస్తున్న రెండు దుకాణాల్లోని బంగారు ఆభరణాలను సీజ్ చేశారు ఈ సందర్భంగా డిఐఎస్ అధికారి అర్చన మాట్లాడుతూ గోల్డ్ షాప్ యజమానులు ఎవరైనా నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు, యజమానులపై కేసులు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభిస్తున్నట్లు తెలిపారు కొనుగోలుదారులు అప్రమత్తంగా ఉండాలని, ప్రతి కొనుగోలుదారుడు బంగారం తీసుకున్న తర్వాత కేర్ యాప్ లో హెచ్ యు ఐ డి నీ పరిశీలించిన తర్వాత సదరు షాపు నుండి బిల్లు తీసుకోవాలని సూచించారు, ప్రతి షాపు యజమాని లైసెన్సు రిజిస్ట్రేషన్ చేయించుకొని ఉండాలని అన్నారు.